ఓటరు నమోదుపై ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు అర్హత పొందిన యువత అందరూ ఓటర్లుగా నమోదు పొందేలా చైతన్య పరస్తూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కృతికా శుక్లా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియ క్రింద చేపట్టిన ఓటర్ల నమోదు, జాబితాల సవరణ, రానున్న ఎన్నికల నిర్వహణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), చొడిశెట్టి రమేష్ బాబు (భాజపా), గదులు సాయి బాబా(టీడీపీ), ఆకుల వెంకట రమణ(ఐ.ఎన్.సీ), సబ్బారపు అప్పారావు(బీఎస్పీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

విశాలాంధ్ర - కాకినాడ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల సంక్షేమానికి అన్ని విధాల చర్యలు తీసుకున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 14వ డివిజన్ పరిధిలోని ముల్లారమ్మ ఆలయం వద్ద బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన ప్రచార బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారాన్ని సైతం సకాలంలో ఇవ్వకుండా మత్స్యకారులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసారన్నారు. గడచిననాలుగున్నర ఏళ్లలో 14వ డివిజన్‌కు వివిధఅభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ.49 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి,నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్ పలువురు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి వికాసంతోనే సమాజ వికాసం

విశాలాంధ్ర - కాకినాడ : పుస్తకాల ద్వారా వ్యక్తి వికాసం జరుగుతుందని తద్వారా సమాజ వికాసం సాధ్యమవుతుందని బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ (కృష్ణ శ్రీ) అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రెండవ రోజైన బుధవారం స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను కృష్ణ శ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ శ్రీ మాట్లాడుతూ ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అతిథిగా స్పెషల్ జ్యూడిషియల్ స్పెషల్ రిటైర్డ్ మెజిస్ట్రేట్ దోమ్మేటి సుధాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ మంచి చదువరులు, గొప్ప ఆలోచన పరులు అవుతారు అనడానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిదర్శనం అన్నారు. గ్రంథాలయాలలోని పుస్తకాలను ముఖ్యంగా యువత చదవాలని గొప్పవారుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో గాంధీనగర్ శాఖా గ్రంథాలయాల లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతకు ఉపయుక్తమైన వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, కాంపిటేటివ్ పుస్తకాలు, చరిత్ర, ఇంజనీరింగ్ వంటి పలు అంశాలపై చక్కని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

పశు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని పినపళ్ల గ్రామాలలో గ్రామీణ పశు వైద్యశాలలను జిల్లా పశువైద్యాధికారి కె. వెంకట్రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులతో పాటుగా ఆసుపత్రి గదులను పరిశీలించారు. అనంతరం స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరిని పశు వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని, పశువులకు గడ్డి కొరత లేకుండా పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ ఎల్. అనిత ఉన్నారు.

జనసేన దివ్యాంగుల అభయ యాత్ర

విశాలాంధ్ర - కాకినాడ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు దివ్యాంగుల అభయ యాత్రలో భాగంగా స్థానిక 37వ డివిజన్ ఫ్రెజర్ పేటలో నాలుగో రోజు యాత్ర మావులూరి సురేష్ నాయుడు, రాగిణి ఆధ్వర్యంలో డివిజన్లో దివ్యాంగులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు సురేష్ నాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆదేశాల మేరకు స్థానిక 37వ డివిజన్ పేటలో దివ్యాంగులను కలుసుకున్నారు. దివ్యాంగుల సమస్యలపై జనసేన చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాబోయే ఆరు నెలల కాలంలో జనసేన, తెలుగుదేశం ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడుశెట్టి శ్రీమన్నారాయణ, మిరియాల హైమావతి, తోరం చిరంజీవి జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ మీడియా కోఆర్డినేటర్‌గా శివరామకృష్ణ

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండలం వైయస్సార్సీపి మీడియా కోఆర్డినేటర్ గా కరాసు శివరామకృష్ణను పార్టీ నాయకులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం వచ్చిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు కరాసు శివరామకృష్ణని పూలమాల వేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వైఎస్ఆర్సిపి తరఫున జరిగే కార్యక్రమాలన్నింటిని మీడియాకు సమాచారాన్ని అందజేయవలసిన బాధ్యత శివరామకృష్ణకు అప్పగించి నట్టు ఎమ్మెల్యే చంటిబాబు తెలిపారు. ఈ బాధ్యతలను శివరామకృష్ణ అంకిత భావంతో నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి రంగ రమేష్,మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు,తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - అయినవిల్లి : కొండుకుదురు గ్రామంలో అగ్నిప్రమాద బాధితులు అబ్బిరెడ్డి సుబ్రహ్మణ్యం కుటుం బాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కొండుకుదురు, కె జగన్నాథపురం, మాగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా సరఫరా చేసిన కొత్త వంట పాత్రలు, లైబ్రరీ పుస్తకాలను ఆయా పాఠశాలలకు అందజేసారు. కె జగన్నాథపురం గ్రామపంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసన్, మండలంలోని వైసీపీ అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్, సర్పంచ్‌లు మేడిశెట్టి హేమలత, కాశి వీర వెంకట సత్యనారాయణ, నాయకులు మేడిశెట్టి శ్రీనివాస్, బొంతు రాజేంద్రప్రసాద్, మట్టపర్తి రామారావు, కమిడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

30 గంటల నిరసన దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రాజోలు : ఈ నెల 20, 21 తేదీలో జరుగనున్న 30 గంటల దీక్ష జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ సమావేశం రాజోలు ఏఐటీయూసీ కార్యాలయంలో కామ్రేడ్ శీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణా జలాల పునర్ పంపిణీ గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ, కరువు నివారణ సహాయక చర్యలు 30 గంటల నిరసన దీక్ష గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ కార్పోరేట్ ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేసి రైతు కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకు వచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ విధానం, నూతన విద్యా విధానంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తి బాబు మాట్లాడుతూ 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదానికి మహిళా శక్తిని ప్రతిభించేలా తరలి వెళ్ళాలని, 20, 21ఛలో విజయవాడ కొరకు సమాయత్తం చేయడానికి, జాతీయ పిలుపు మేరకు ఈనెల 27, 28 తేదీల్లో రైతులు కార్మి కులు మహాధర్నా జయప్రదం చేయడానికి జిల్లాలో ఏఐటీయూసీ, ఎపి రైతు సంఘం నుంచి జిల్లా స్థాయిలో పెద్ద సంఖ్యలో సమీకరణ చేయాలని సత్తిబాబు ప్రతిపాదన పెట్టారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జనవరి 4, 5, 6 తేదీలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరుగనున్న నేపథ్యంలో నవంబర్ ఆఖరు వారంలో కోనసీమలో ఒక రైతు సెమినార్ జరపాలని, డిశంబర్ 8, 9 తేదీల్లో రాజకీయ శిక్షణా తరగతులు మలిక్కిపురంలో జరపాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్, పి.రాము, కొండే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న మోదీ, జగన్

- రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై 27, 28న మహాధర్నా జయప్రదం చేయండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : 10 సంవత్సరాల పాటు ప్రత్యేక హెూదా ఉండాలని పార్లమెంట్లో పట్టుబట్టిన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పడమే కాక వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల సత్వర అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వకుండా తీరని అన్యాయం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. బుధవారం స్థానిక జట్లు లేబర్ యూనియన్ కార్యాలయంలో మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కర్షక, కార్మిక, సామాన్య, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీలలో విజయ వాడలో జరిగే మహాధర్నాకు జిల్లా వ్యాప్తంగా కార్మిక, రైతు వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పలు దశాబ్దాలుగా సంఘటిత పోరాటాల పర్యవ సానంగా కార్మికలోకం సాధించుకున్న హక్కులకు భంగం కలిగిస్తూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చేలా మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని అన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండానే లేబర్ కోడ్లను పార్లమెంట్లో పాస్ చేయడం దారుణం అన్నారు. రోజుకు 8 గంటల పని దినాన్ని మోడీ ప్రభుత్వం 12 గంటల వరకు పరిమితిని పెంచిందని, కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని మధు విమర్శించారు. మోదీ, జగన్ అవలంబి స్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని మధు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జట్లసంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి వి. కొండల రావు, జట్లసంఘం అధికార బాడీ సభ్యులు పి. దేముడుబాబు, జి, వెంకటరావు, ఆర్. వెంకట రావు, దుర్గాప్రసాద్, కాళ్ల అప్పల నాయుడు, నల్ల రామారావు, మేస్త్రిలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

-జిపిఎస్ ట్రాకర్ వాహనాలతో సమస్యలు
-దళారీ వ్యవస్థతో జోరుగా ధాన్యం కొనుగోళ్లు
-నష్టపోతున్న రైతులు
-సమస్యలపై కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రతి ఏటా ధాన్యం కొనుగోలులో సమస్యలు వస్తూనే ఉన్నాయి. రైతులు సకాలంలో ధాన్యాన్ని అమ్మలేక అప్పుల పాలవుతూనే ఉన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే సమయంలోనే గతంలో ధాన్యం కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో అలా లేదని రైతులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే ఆలమూరు మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంతో రైతులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. వరి కోతలు మొదలై 20 రోజులు దాటినప్పటికీ కొనుగోలు కేంద్రాలలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఆలస్యమవుతోంది. ఒకేసారి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈసారి కొత్తగా ధాన్యం కొనుగోలు విషయంలో జిపిఎస్ ట్రాకర్, బయోమెట్రిక్ వంటి సమస్యలు తలెత్తాయి. రైతు భరోసా కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ ట్రాక్టర్ పరికరాలను అమర్చడంతో పాటు రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు సూచించారు. రైతులు సేకరించిన ధాన్యాన్ని జిపిఎస్ ట్రాకర్ అమర్చిన వాహనముతో రైతు భరోసా కేంద్రాల వద్దకు తరలించగా సిబ్బంది ఆ జిపిఎస్ ట్రాకర్ ద్వారా ఆన్లైన్ చేసి రైస్ మిల్లులకు తరలిస్తారు. ఆన్లైన్ సాంకేతిక లోపాలతో సమస్యలు ఏర్పడి రైస్ మిల్లులు వద్ద వాహనాన్ని నిలిపివేస్తారు. అదే సమయంలో మరో రైతు అతని ధాన్యాన్ని తరలించాలంటే ప్రభుత్వం వారు జిపిఎస్ ట్రాకర్ అమర్చిన వాహనాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు ఈ సాంకేతిక సమస్యలను ఎదుర్కొనలేక, ఒక ప్రక్క వాతావరణ సమస్యలతో బాధపడుతూ దళారీ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. బుధవారం కొత్తూరు సెంటర్లో జిల్లాస్థాయి అధికారులు మండల స్థాయిలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. వివిధ సమస్యలతో కూడిన 96 అర్జీలను ప్రజలు సమర్పించారు. సమస్యల పరిష్కార దిశగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. దీనిలో భాగంగా రైతులు తమ సమస్యతో కూడిన అర్జీ పత్రాన్ని అందజేశారు. ఆయన తక్షణమే స్పందించి రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సమస్యలను రైతులు ఎంతకాలం ఎదుర్కోవాల్సి వస్తుందో వేచి చూడాలి.

సచివాలయ వ్యవస్థ పై కేంద్ర బృందం అధ్యయనం

విశాలాంధ్ర - జగ్గంపేట : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ పనితీరుపై కేంద్ర బృందం సభ్యులు బుధవారం జగ్గంపేటలో అధ్యయనం చేశారు. భారత్ దర్శన్ పథకంలో భాగంగా జగ్గంపేట విచ్చేసిన అధికారుల బృందాన్ని మండల సచివాలయాల కన్వీనర్, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, పంచాయతీ కార్యదర్శి గణేష్ బాబు స్వాగతం పలికారు. బృందం సభ్యులు జగ్గంపేట సచివాలయం 2, రైతుభరోసా కేంద్రాలను పరిశీలించారు. సచివాలయ వ్యవస్థ విధివిధానాలు, పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారు లకు అందే విధానం గురించి అడిగి తెలుసుకుని, ప్రభుత్వానికి, లబ్ధిదారులకు అనుసంధానంగా పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థ గురించి లోతుగా అధ్యయనం చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అధ్యయన బృందంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంజాన్ చౌహాన్, అనుభ చౌహాన్, హిమాన్షు వెర్మ, మనీష్ కుమార్, రాకేష్ కుమార్ ఉన్నారు.

ఇతర దేశాలకు పూత రేకుల ఎగుమతి

సహకారం అందిస్తామన్న మంత్రి అమర్నాథ్ రెడ్డి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురం నుండి ఇతర దేశాలకి నాణ్యమైన పూత రేకులను ఎగుమతి చేసేందుకు అవసరమైన చేయూత అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆత్రేయపురం పూతరేకుల కీర్తిని చాటి చెప్పేలా ఢిల్లీ ప్రగతి మైదానంలో ఎంఆర్ఆర్ ఫుడ్స్ అధినేత రామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కో - ఆర్డినేటర్ రాజీవ్ వర్మ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ స్టాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్రేయపురం పూతరేకుల స్టాల్‌ను ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా రామరాజు పలు అంశాలను మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకు వెళ్లారు. పూత రేకుల స్టాళ్లను ఏర్పాటు చేసిన ఎంఆర్ఆర్ ఫుడ్స్ అధినేత రామరాజును, రాజీవ్ వర్మను ఆయన అభినందించారు.

అడ్డూ అదుపూ లేకుండా కలప అక్రమ రవాణా

విశాలాంధ్ర - సీతానగరం: అడ్డూ అదుపూ లేకుండా కలప అక్రమ రవాణా అవుతోంది. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాలకు కొన్ని రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. సీతానగరం మండలానికి దగ్గరగా ఉండే ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం, శరభవరం, గోకవరం, రంపచోడవరం గ్రామాల నుండి అటవీ సంపదను కొంత మంది వ్యాపారులు దోచు కుంటూ అడవులను నాశనం చేస్తున్నారని ప్రజల నుండి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కలప అక్రమ రవాణా ఇంత యథేచ్ఛగా సాగడానికి అధికారుల అండదండలు వ్యాపారుల పై పుష్కలంగా ఉన్నాయని చెప్పొచ్చు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టి కలప అక్రమ రవాణాకు అడుకట్ట వేసి ప్రకృతిని పరిరక్షించాలని ప్రజలు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

ఆసాదులను గుర్తించిన ప్రభుత్వం వైసీపీ

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - మండపేట : ఆసాదుల సామాజిక వర్గానికి గుర్తింపు తెచ్చింది వైసీపీ ప్రభుత్వమేనని ఏపీ ఆసాదుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు లేగా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీసీ (ఏ)గా జీవో అమలు చేసి కీ.శే. వైఎస్ రాజశేఖరరెడ్డి తమ సామాజిక వర్గం గుండెల్లో కొలువైతే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి రాష్ట్ర వ్యాప్త గుర్తింపు కలగజేసారని అన్నారు. బుధవారం ఏడిద రోడ్డు పోలేరమ్మ ఆలయం వద్ద సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు లేగా వెంకన్న ఆధ్వర్యంలో సీఎం జగన్‌కు పాలాభిషేకం నిర్వహించారు. ఆ సామాజిక వర్గం మహిళలు పురుషులు సీఎం చిత్రపటం ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లా డుతూ మొన్నటి దాకా తమ సామాజిక వర్గం వారు ఉభయ గోదావరి జిల్లాలకే పరిమితమై ఉండేవారన్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కూడా తమ వారు వ్యాపించి ఉన్నారన్నారు. విద్య, ఉద్యోగం ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధికి కుల ధృవీకరణ పత్రాలు అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు వేమవరపు రాంబాబు మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో పిల్లి నాగేశ్వరరావు, కోరుకొండ రాజు, లేగా హరిబాబు, లేగా చిన్న, లేగా సత్యనారాయణ, లేగా రాజు, లేగా శ్యామ్ కుమార్, మండపల్లి మహేష్, పిల్లి చలపతి, కోరుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

విశాలాంధ్ర -కాకినాడ : విజయమే లక్ష్యంగా చేసుకొని కలిసి పనిచేయాలని కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంనకు చెందిన టీడీపీ-జనసేన నేతలు స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం కాకినాడ నగరంలోని బోట్ క్లబ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ శాఖ చెందిన హాలులో కార్యకర్తలతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ టీడీపీ-జనసేనలకు చెందిన పార్టీల నాయకులు చేసిన ప్రసంగం ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తల్లో ఉత్తేజాన్ని ఇచ్చాయి. ఈ సమావేశం జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంను టీడీపీ కాకినాడ రూరల్ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు పర్యవేక్షించారు. ఈ సమావేశంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఈ అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించటమే లక్ష్యంగా ఇరు పార్టీలకు చెందిన టీడీపీ నాయకులు, జనసైనికులు ప్రసంగించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ తరపున కరెడ్ల గోవిందు, కదలి ఈశ్వరి, పోలసపల్లి సరోజ, తాటికాయల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

టిబి రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సహాయంతో జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం టిబి రోగులకు పౌష్టికాహారం కిట్స్‌ను పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి టిబి ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా పోషకాహర ఫుడ్ పాకెట్స్‌ను వైద్యురాలు పి వాసవి రోగులకు అందజేశారు. సిహెచ్‌సి పరిధిలోని 42 మందికి పంపిణీ చేసినట్లు పిపిఎం కో ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్ వైజర్ వి. స్వామి నాథన్, ఆర్. రామారావు, వి. ఆశాజ్యోతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దాళ్వాకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తాం

విశాలాంధ్ర - కరప : దాళ్వా పంటకు కరప, కాజులూరు, తాళ్ళరేవు, మండలాలకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని నడకుదురు డివిజన్ ఏడిఏ కె.బాబురావు తెలిపారు. నడకుదురు ఏడిఏ కార్యాలయంలో మూడు మండలాలకు సంబంధించిన వ్యవసాయ సలహా మండలి సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించినట్టు ఏడీఏ బాబురావు తెలిపారు. రైతులు డిసెంబర్ నెలాఖరునాటికి నాట్లు పూర్తి చేయాలని, లేదా డిసెంబరు మొదటివారం నాటికి వెదలు చల్లుకోవాలని రైతులకు సూచనలు, సలహాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కరప వ్యవసాయ అధికారి రాజేష్, చైర్మన్లు గుత్తుల బుల్లి రాజు, ఏఏబి మెంబరు బి. సూర్యనారాయణ, బండే పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విజయం

విశాలాంధ్ర-దేవరపల్లి: ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు విజయవాడలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సపక్త తక్రా 14, 17 విభాగాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విజయం సాధించినట్లు దేవరపల్లి మండలం రామన్నపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ తెలిపారు. 14 విభాగంలో బాలికల్లో ప్రథమ స్థానం అండర్ 17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. రామన్నపాలెం నుండి 14 విభాగంలో మంచి లాస్య జనశ్రీ, 17 విభాగంలో మిరియాల మహాలక్ష్మి, ఎస్.కె మనీషా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన వారిని స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ పిడి సరస్వతి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

టీడీపీ, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలి

విశాలాంధ్ర - పి గన్నవరం : రాష్ట్ర అభివృద్ధి కోసం వచ్చే ఎన్నికలలో ప్రజలందరూ టిడిపి, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు కోరారు. ఈ మేరకు పి గన్నవరం మండలంలోని యర్రంశెట్టి వారి పాలెం గ్రామంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిది సాయిబాబు నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు టిడిపి అధినేత చంద్రబాబు రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి ముచ్చర్ల సాయి సత్యనారాయణ, బూత్ కన్వీనర్ సిద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, టిడిపి నాయకులు నారిన సత్తిపండు, చీకట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ సౌజన్యంతో మెరిట్ స్కాలర్ షిప్పుల పంపిణీ

విశాలాంధ్ర - కిర్లంపూడి : సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని కిర్లంపూడి మండలం వీరవరం కెనరా బ్యాంక్ మేనేజర్ కెఎస్ఏ, నరసింహం తెలియజేశారు. కెనరా బ్యాంక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యా జ్యోతి పథకంలో భాగంగా వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థునులకు మెరిట్ స్కాలర్ షిప్పులు మేనేజర్ నరసింహం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ నరసింహం మాట్లాడుతూ భవిష్యత్తులో తమ బ్యాంకు తరపున మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు తమ వంతు పూర్తి సహకారం అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా మెరిట్ స్కాలర్ షిప్పులు అందుకున్న విద్యార్థులు. బర్రె రహారిక, పీతల దివ్య, కలగా పాప, మోతా నవ్య, కలగా రాణి, చిక్కాల లక్ష్మీ రజిని మాట్లాడుతూ కెనరా బ్యాంక్ వారు అందించిన ప్రోత్సాహం పట్ల ఆనందం వ్యక్తం చేయడమే కాకుండా, బ్యాంక్ మేనేజర్ నరసింహంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలాది దుర్గాప్రసాద్, ఎం. సౌజన్య, ఎం. రూబన్, పి.సూర్య కుమారి, ఎం. ప్రశాంత్ కుమార్, బ్రహ్మాజీ, బి. సత్తిబాబు, కొండబాబు ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీ జిల్లా అధ్యక్షునిగా కోన సత్యనారాయణ

విశాలాంధ్ర - మండపేట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షునిగా జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు, మండపేట ప్రముఖుడు కోన సత్యనారా యణ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఏడిద సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక వన సమారాధన కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా కన్వీనర్ గంగుమల్ల రాంబాబు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికలు నిర్వహిం చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈబీటీ రాజు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు బల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ముఖ్య సలహా దారుడు నిడమర్తి జయసూర్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మండపేట రత్న ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ఎన్. కిరణ్ కుమార్ షుగర్ వ్యాధి నివారణ చర్యలు వివరించారు. అనంతరం సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారిగా మట్టా వీరబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మారిసెట్టి సత్యనారాయణ, బల్లా వెంకట రమణ, మేడిశెట్టి రామకృష్ణ, ఏడిద లక్ష్మణ ఆచార్యులు, వీకే రాజు, ఆర్ ఎల్ నారాయణ, గుబ్బల సత్యనారాయణ, పున్నం రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే చంటిబాబు

విశాలాంధ్ర-గోకవరం : మండల కేంద్రమైన గోకవరంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనితీరును జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం అవుతున్న ఈ ప్రభుత్వాసుపత్రిలో వివిధ విభాగాల నిర్మాణాల పనులు ఏ విధంగా జరుగుతున్నాయని ఆసుపత్రి కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే చంటిబాబు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పనితీరును వేగవంతంగా పూర్తి చేయా లని ఎమ్మెల్యే చంటిబాబు ఆసుపత్రి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ రమేష్, ఆస్పత్రి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ బాల భవన వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-ఏలూరు: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా శనివారపుపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న బాలలకు మాదకద్రవ్యాల వలన కలిగే శారీరక, మానసిక సమస్యలు - వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి. నెహేమియా మాట్లాడుతూ అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఏలూరులోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈనెల 14 నుండి 20 వరకు ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన, పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలలకు జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కులు ఉన్నాయని, బాలల హక్కులని అందించవలసిన భాద్యత అందరి పైన ఉందన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి. రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన భవిష్యత్తు గ్యారంటీ బాబు షూరిటీ ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుందని పోలవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో దిప్పకాయల పాడు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పరిపాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తున్నదని, సైకో పరిపాలన పోయి, సైకిల్ పరిపాలన రావాలని తెలిపారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన వివిధ పథకాలనుప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ సిద్దు, యూనిట్ ఇంచార్జ్ యనమదల ప్రసాద్, గెడ నాగబాబు, బొమ్మ గంటలయ్య, చాపల చినబాబు,ఆకుల అరుణ, పెండ్యాల రమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

విశాలాంధ్ర-భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సంపాదన నిలయాలని భీమడోలు జడ్పిటిసి తుమ్మగంట భవాని రంగా అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలన జడ్పిటిసి నిర్వహించారు. గ్రంథాలయం ప్రాముఖ్యత కరపత్రాలను వారు ప్రారంభించారు. ముందుగా దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు జయంతి సందర్భంగా నెహ్రు, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.పలువురు మాట్లాడారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని చిన్నతనం నుంచి సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయానికి పంచాయతీ స్థలం కేటాస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, చైతన్య యూత్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ పాము మాన్ సింగ్, లైబ్రరీ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు తుమ్మల ఉమామహేశ్వరరావు,లైబ్రరీ గౌరవ అధ్యక్షులు రామకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు జగన్ ప్రభుత్వం పోత్సాహం

విశాలాంధ్ర - గణపవరం: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సహం ఇస్తూ గ్రామస్థాయి నుండి చదరంగం ఆటలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహించడం జరుగుతుందని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. బుధవారం గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర కళాశాలల చదరంగం పోటీలను రెండు రోజులపాటు నిర్వహించడం జరిగింది. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నదని, ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్ర ప్రదేశ్ గా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు.ప్రతి విద్యార్థి, విద్యార్థినులు అన్ని స్థాయిలలోని వారు చదరంగంపై మక్కువ పెంచుకునే విధంగా పాఠశాల స్థాయి నుండే చదరంగం ఆటలు ఉపయోగపడుతాయి అని అన్నారు.ఈ చదరంగం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, అవంతి సత్తిబాబు,కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: గిరిజనుల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాటం సాగించిన మహో న్నత వ్యక్తి బిర్సా ముండా అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి కొనియాడారు. నిట్ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వారి వలస వాదంపై తిరుగుబాటు చేసి తెల్లదొరలకు కంటి మీద కునుకులేకుండా చేసిన ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా గురుంచి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఆదివాసీలు చదువుకుని విద్యావంతులు కావాలని, వారిలో చైతన్యం తీసుకురావటంతోపాటు ఆదివాసీల ఐక్యతకు పాటుపడిన గొప్ప వీరుడు బిర్సా ముండా అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ తలారి రేష్మా, వైద్యాధికారి ధర్మతేజ, సాన్ అసిస్టెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు ఎస్. రాజేష్ అధ్యక్షతన ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎంఈఓ టీవీ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ కలిగి జీవించాలని, కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1990 91- సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యం, పల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుప్త శ్రీనివాస్ కుమార్ రాజాలు రూ.22 వేల విలువచేసే వైర్ లెస్ మైక్ సెట్ ను బహుకరించారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని పెంటపాడు మండలం పరిమెళ్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కాంతి శ్రీ, పెంటపాడు మానవతా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సెక్రెటరీ వీరస్వామి,హాస్టల్ వార్డెన్ రామకృష్ణ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా జిల్లా మనత సంస్థ తరఫున హాస్టల్ విద్యార్థులకు పెనులు పుస్తకాలు అందజేశారు. పదవ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయల నగదు బహుమతిని మానవతా సంస్థ తరపున ప్రకటించారు.

పాలకొల్లులో టిడ్కో రగడ

- ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర అరెస్టు

విశాలాంధ్ర - పాలకొల్లు: టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పేద ప్రజలను దగా చేస్తోందని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులైన పేదలకు ఇళ్ళు అందకుండానే రుణాల పేరుతో వారిని మానసికంగా వేధిస్తోందని మండిపడ్డారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టిడ్కో లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల ఆధ్వర్యంలో బుధవారం టిడ్కో గృహ సముదాయాల వద్ద "పాలకొల్లు చూడు - "వంటావార్పు" కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఎమ్మెల్యే నిమ్మలను గృహ నిర్బంధం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగరను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా పోలీసుల కళ్లుగప్పి నిమ్మల పూలపల్లి సెంటర్‌కు చేరుకున్నారు. పూలపల్లి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఎమ్మెల్యే నిమ్మలకూ చాలాసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. టీడీపీ హయాంలో పేదలకు కేటాయించిన ఇళ్లను పేదలకు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. అనంతరం పోలీసులు నిమ్మలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఉద్రిక్తత పరిస్థితుల మధ్యనే ఎమ్మెల్యే నిమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకొని పెనుగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేషనల్ స్కూల్‌లో ఘనంగా బాలోత్సవం

విశాలాధ్ర- కైకలూరు : కైకలూరు నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో బాలోత్సవ్-2023 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ స్కూల్‌లో 14 రోజుల పాటు బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా యాజమాన్యం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆటపాటలతో వారిలో ఉత్సాహం కలిగే విధంగా ఏర్పాటు చేసిన ఆటపాటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియచేసి విద్యార్థులలో మానసిక ఉల్లాసం కోసం ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యంకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడివి వెంకట కృష్ణ మోహన్, బిసి నాయకులు చేబోయిన వీర్రాజు,పిఏసియస్ అధ్యక్షులు గంగుల అశోక్,స్కూల్ ప్రిన్సి పాల్ చంద్ర మోహన్,శ్రీనివాస్, రాజశేఖర్, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు,ఉపాధ్యాయులు తది తరులు పాల్గొన్నారు.

తణుకులో బీసీ సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: నవంబర్ 17వ తేదీన తణుకు పట్టణం కమ్మ కమ్యూనిటీహాలులో నిర్వహించనున్న పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ బీసీ సదస్సును అన్ని రాజకీయపార్టీల బీసీ సోదరులు జయప్రదంచేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. భీమవరంలో బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్ ప్రతిపక్ష నేతగా బీసీలకు అనేక హామీలు వాగ్దానాలను ప్రకటించి అధికారం వచ్చిన తరువాత ఆ హామీలను విస్మరించారన్నారు. ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి భీమవరం పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్ మాట్లాడుతూ బీసీలకు కులాలు వారిగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్న ముఖ్యమంత్రి జగన్ తాను ఇచ్చిన మాటను తప్పారని కేవలం పదవులు ఇచ్చి కుర్చీలు ఇవ్వలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. తెదేపా ద్వాక్రా అంగన్వాడి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేరగాని నారాయణమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీలకు ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలను పనిముట్లను అందించి వారి సంక్షేమ అభివృద్ధికి సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో భీమవరం మండల టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేపు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, భీమవరం మండల జనసేన ఇన్చార్జి మోకా శ్రీనివాస్, జనసేన నాయకులు నాగిడి ఏడుకొండలు, కట్టా నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలవాలి



విశాలాంధ్ర -భీమవరం: మెంటేవారితోటలో అగ్నిప్రమాదంలో నిర్వాసితులైన కుటుంబాల్ని జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు పట్టణ నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ తరపున ఏడు కుటుంబాలకు 5 వేలు చొప్పున మొత్తం 35 వేల రూపాయలు అందచేశారు. అనంతరం కొటికలపూడి మాట్లాడుతూ బాధితులకు జనసేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్, పట్టణ సెక్రటరీ సుంకర రవి, వానపల్లి సూరిబాబు,కట్రేడ్డి రాము, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ మహిళా విభాగం కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ఏపి జేఏసి అమరావతి పశ్చిమ గోదావరి జిల్లా మహిళావిభాగం ఆవిర్భావ సమా వేశం బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘము ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈసమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా మహిళా విభాగం కమిటిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో జిల్లా మహిళావిభాగం ఛైర్పర్సన్ గా వై.నాగమణి ప్రధాన కార్యదర్శి గా శ్యామలదేవి తో పాటు వివిధ శాఖలకు చెందిన మరో 10 మందిని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈ సమావేశానికి జిల్లా చైర్మన్ శివ శంకర్ అధ్యక్షత వహించగా, ఏపిజేఏసి అమరావతి నాయకులు టి.వి.ఫణి పేర్రాజు, స్టేట్ మహిళా విభాగ ఛైర్పర్సన్ పారేలక్ష్మి, కోశాధికారి జి. పావని, కార్యదర్సులు. సిహెచ్ కోటేశ్వరి, జి అనూష మరియు జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్,వివిధ సంఘ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెడతాడేపల్లి గురుకులం బ్యాండ్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : పెడతాడేపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బ్యాండ్‌కు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ బి.రాజా రావు తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని ఎస్‌విబిడి హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బ్యాండ్ కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం లో నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన అంబేద్కర్ గురుకులం కు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందుకున్నారు. డిసెంబర్ 3వ తేదీన కేరళలోని త్రివేండ్రంలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారు.

అచ్యుతాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించి రానున్న ఎన్నికలలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి, రోగుల వ్యాధిని నిర్ధారించడంతోపాటు వారికి అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు అచ్యుతాపురం గ్రామపంచాయతీ వద్ద 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ రమేష్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్ఆర్సిపి నాయకులు ఆకుల సత్యనారాయణ, ఎంపీటీసీ కొత్త పల్లి బుజ్జి, గ్రామ సర్పంచ్ బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని, మంచి భావాలతో భావి భారత పౌరులుగా ఎదగాలని, మంచిగా చదువు కోవాలని అలయన్స్ క్లబ్స్ అంతర్జాతీయ కమిటీ ఛైర్పర్సన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కిరణ్ కుమార్ అధ్యక్షతన చేయూత సంస్థలో శ్రీనివాస్, భవ్య దంపతుల కుమారుడు షర్విన్ జన్మదినం సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి చిన్నారులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట క్లబ్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లలకు సేవా గుణం అలవాటు చేయాలని తద్వారా భవిష్యత్తులో ఎదుటివారికి సేవ చేసే గుణం వారికి అలవాటు అవుతుందని అన్నారు. క్లబ్ పిఆర్ఓ సుందరి మాట్లాడుతూ శ్రీనివాస్ భవ్య దంపతులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వారి కుమారుడి జన్మదిన వేడుకలను చిన్నారుల మధ్య జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలై పెంకే గోవిందరాజు, డిస్ట్రిక్ట్ ట్రెజరర్ అలై కే సతీష్, అలై వనుం ఉపేంద్రనాథ్, అలై దంగేటి సత్తిబాబు, కొండా వినాయక్, అలై దుర్గ, అలై మని, జయ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రస్తుత సమాజంలో ప్రపంచ శాంతికై ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మికతను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, క్రీస్తు శాంతి ప్రార్ధనా మందిరాల వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, ప్రముఖ వైద్యులు చిర్రాపూరి గంగారావు (దత్తుడు)లు అన్నారు. ప్రపంచ శాంతికై క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే 'ఏసు కొరకు నడక' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దాపురం మండలం తిరుపతిలో ప్రారంభమయ్యే 'వాక్ ఫర్ జీసస్' మహిళల ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీనుద్దేశించి వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరించడంతో ప్రపంచంలో శాంతి నెలకొల్పబడుతుందని ఆయన ఆధ్యాత్మికత్వంలో నమ్మకంతో ప్రపంచశాంతికై చేపట్టిన వాక్ పర్ జీసస్ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రపచంలో అశాంతి రాజ్యమేలుతుందని ఆ రుగ్మతల నుండి ప్రజా సంక్షేమంకై ప్రతీ ఒక్కరూ ఏసు బోధనలు ఆచరించాలని రాయవరపు వీరబాబు, క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆయా సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

కూనవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం రాజానగరం టిడిపి ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. వెంకటరమణ చౌదరి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే ఏ విధంగా రాష్ట్ర అభివృద్ధి చేస్తారో వివరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య మొదలగు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు



విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల డిగ్రీ, పిజి కళాశాలకు చెందిన గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సంజయ్ కుమార్, ఫోరెన్సిక్ శ్రీ విలాస్ చవాన్ గ్రంథాలయోద్యమ రూపకర్త అయ్యంకివెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాధన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జాతీయస్థాయిలో గ్రంథాలయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన అయ్యంకి వారు మన తెలుగు వారు, గోదావరి ప్రాంతం వాసి కావడం గర్వకారణం అన్నారు. గ్రంథాలయాధికారి భూదేవి, వీరాస్వామి మాట్లాడుతూ నవంబర్ 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథా లయ వారోత్సవాలు నిర్వహిస్తూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా 14వ తేదీ నుంచి 20 వరకు విద్యార్థులకు గ్రంథాలయాలపై వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్చరీ కిట్స్‌కు గుడ్‌సీడ్ రూ.30 వేల సాయం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం, రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థుల ఆర్చరీ కిట్స్‌కు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. ఈ మేరకు అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అందజేసిన రూ.30 వేలు చెక్కును బుధవారం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి మధు కుమార్ రావు, జి భాస్కరరావులకు అందజేశారు. సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మి ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పరమట రాజేష్, కుంచే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత్ భారత్ అభియాన్ దిశగా అడుగులు వేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యార్థులు ఉన్నత్ భారత్ అభియాన్ దిశగా అడుగులు వేయాలని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రాంతీయ సమన్వయకర్త భీశెట్టి పావని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ పట్టిసం వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దాపురం మండలం దివిలి, బిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ మొయిళ్ళ సూకరాజు అలియాస్ చంటి ఆధ్వర్యంలో ఉన్నత భారత్ అభియాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ జి.నాగరాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉన్నత భారత్ అభియాన్ సమన్వయకర్త మొయిళ్ళ రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్, సూర్య ప్రకాష్, కళాశాల కార్యనిర్వాహణాధికారి, బుల్లిరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారి పాదాలమ్మ తల్లి గుడి దగ్గర ఉన్న శ్రీ శారద వయోవృద్ధుల ఆశ్రమం వద్ద సూపర్ స్టార్ కృష్ణ మొదటి వర్ధంతి సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు సలాది కృష్ణ ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు ఫ్రూట్స్, బ్రెడ్లు పంపిణీ చేశారు. మరియు దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ బేరి రాంబాబు, వేగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యానారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు చదివిన పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బొల్లం రెడ్డి వీర వెంకట సత్యనారాయణ ప్రస్తుతం తిమ్మాపురం ఏ ఏస్ఐగా పనిచేస్తున్నారు. అతి పేద కుటుంబంలో పుట్టిన ముచ్చుపల్లి భాగ్యలక్ష్మి కాకినాడ విజయ గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడడంతో కరప గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కోరిక మేరకు 13 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారని తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాగంలో ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. శరభరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా భారత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు పుణ్యమంతుల రజిని చేస్తున్న సేవా కార్యక్రమాలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు రజిని మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది అవసరార్థులకు చేతనైనంత వరకు సహాయం చేస్తున్నామన్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గుద్దటి శివసత్య ప్రసాద్‌ను జీవన సాఫల్య పురస్కారంతో ఫౌండేషన్ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశీ వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ వేటుకూరు సుబ్బరాజు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొక్కా నాగరాజు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - మామిడికుదురు : విద్యార్థులంతా గ్రంథాలయాల ఆవశ్యకతను తెలుసుకుని పుస్తక పఠనం అలవర్చుకోవాలని మామిడి కుదురు గ్రంథాలయాధికారి ఎ. సూర్యనారాయణ అన్నారు. 56వ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా మామిడికుదురు శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన పుస్తకాలను తిలకించి పలు విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

తెలుగుదేశం, జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీల ఆత్మీయ కలయిక సమావేశాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు తాడి నరసింహారావు స్వగృహం వద్ద నిర్వహించారు. తెలుగు దేశం, జనసేన పార్టీల నియోజకవర్గ ఇన్చార్జులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా అమలాపురం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ గంటి హరీష్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకువెళ్లి రాష్ట్రంలో ఈ దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని దీనికోసం తెలుగుదేశం, జనసేన రాష్ట్ర కార్యవర్గం ఏ ఆదేశాలిస్తే దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గుద్దటి జమ్మి, గొలకోటి దొరబాబు, తాడినరసింహారావు, రంబాల రమేష్, ముత్యాల జయ, జక్కంశెట్టి పండు, సానబోయిన మల్లికార్జునరావు, రంబాల రమేష్, గోదసి పుండరీష్, దూడల స్వామినాయుడు, కురసాల శివ బాబు, మాదాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను కాకినాడ గోల్డ్ మార్కెట్ వ్యాపారస్తులకు, ప్రజలకు కరపత్రాలు పంపిణి చేస్తూ, తెలుగుదేశం పార్టీ ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు "సూపర్ సిక్స్ పథకాలు" ద్వారా ప్రయోజనాలను బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ బాండ్లలో వారికి వచ్చే ఆర్థిక ప్రయోజనాలు నమోదు చేసి ఆ బాండ్‌లను వారికీ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మానిఫెస్టోనీ ప్రజలవద్దకు తీసుకువెళ్లవలసిన భాధ్యత ప్రతి తెలుగు దేశం కార్యకర్తకు ఉందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్ చేతిలో మోసపోయారని, వారందరికీ భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకే పూర్ టు రిచ్, అన్నదాత, ఇంటింటికీ సురక్షిత తాగునీటి కనెక్షన్, మహాశక్తి, యువగళం, బీసీలకు రక్షణ చట్టం ఈ ఆరు పథకాలను చంద్ర బాబు రూపొందించారన్నారు. మహానాడులో విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోకీ రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని భవిష్యత్తులో మరిన్ని పథకాలు చంద్ర బాబు ప్రకటిస్తారని, రేపటి పౌరుల బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు ఆలోచించే నాయకుడు మన చంద్రబాబే అని సుంకర పావని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడికి వెళ్ళినా వైసీపీ ప్రభుత్వాన్ని చీదరించుకునే స్థాయికి వెళ్ళిందంటే మన రాష్ట్ర ముఖ్యమంత్రి పరిపాలన ఏ విధంగా ఉందో అర్థమవుతుందని సుంకర పావని అన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ రావాలంటే చంద్ర బాబు ముఖ్య మంత్రి కావాలని, రాబోయే ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ కీ ఓటు వేసి చంద్రబాబుని ముఖ్య మంత్రిగా గెలిపించాలని సుంకర పావని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం సభ్యులు సుగుణ, రమణమ్మ, శేషుకుమారి, శ్యామల, పార్వతి, సత్య, కుమారి, శేషాచలం, రాజ్యలక్ష్మి, అరుణా, సింహాచలం, దుర్గ, అష్టలక్ష్మి, సుందరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో రూ. 28 కోట్లతో అభివృద్ధి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం లోని గజ్జరం గ్రామానికి వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నాలుగేళ్లలో సంక్షేమం, అభివృద్ధి క్రింద 28 కోట్ల రూపాయల విలువైన సేవలు అందాయని గ్రామ సర్పంచ్ గండి రాంబాబు అన్నారు. వై.ఏ.పి నీడ్స్ సి ఎం జగన్ కార్యక్రమాన్ని గ్రామ అధ్యక్షులు గన్నిన రత్నాజి అద్వర్యం లో సర్పంచ్ రాంబాబు నిర్వహించారు. గ్రామం లో చేపట్టిన అభివృద్ధి పనుల జాబితాను ప్రదర్శించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామ సందర్శన, రచ్చబండ కార్యక్రమాలు జరిగాయి. మండల వైకాపా నాయకులు కాకర్ల వెంకటేస్వరరావు, గౌరవ అధ్యక్షులు కృష్ణ, ఎం పి పి పోసిరాజు, ఎ ఎం సి శ్రీనివాస్, ఎంపీటీసీ గుంటి చిన్నబ్బాయి ,స్థానిక నాయకులు గర్రె శ్రీను, వార్డు మెంబెర్లు, సచివాలయ సిబ్బంది గృహసారదులు, పాల్గొన్నారు.